క్లుప్తంగా

ఆధార్ సెంటర్ ప్రారంభం


ఆధార్‌సెంటర్ ప్రారంభిస్తున్న నిర్వాహకులు

సాక్షి స్పందన

లింగాపూర్: గత ఆరు నెలల నుంచి మండల కేంద్రంలోని ఆధార్‌సెంటర్ మూసి ఉండడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా గత నెల 20న 'సాక్షి'లో 'ఆధార్ కేంద్రం లేక అవస్థలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు ఆధార్ సెంటర్ పునఃప్రారంభంపై చర్యలు తీసుకున్నారు. వారి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వాహకులు రాంప్రసాద్, శ్రీనివాస్ ఆధార్ సెంటర్ తిరిగి ప్రారంభించారు.

కోట్నాక భీంరావుకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మాజీ మంత్రి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి తండ్రి కోట్నాక భీంరావు 23వ వర్ధంతి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన ఘనత ఉందని, నేటి గిరిజన నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకొని రాజకీయంగా ఎదగాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న నాయకులు

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన బాధితులకు శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం సాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఖాలీం పాషా, వాడులే రుషి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై సర్వే


చెడ్వాయిలో సర్వే చేస్తున్న ఏవో మనీషా

పెంచికల్‌పేట్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెడ్వాయిలో దెబ్బతిన్న పంటలను ఏవో మనీషా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పెద్దవాగు, ప్రాణహిత, ఉప్పమల్లా వాగు, బొక్కివాగు వరదలతో సుమారు 1300 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ఆయా క్లస్టర్లలో జరిగిన పంట నష్టాన్ని పరిశీలించి నమోదు చేస్తున్నామని తెలిపారు. రైతులు పంట నష్టం వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో గౌసియా, రైతులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రెబ్బెన: మండలంలోని నవేగాం శివారులో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రామయ్య అనే రైతుకు చెందిన పత్తి చేను సమీపంలో కుళ్లిపోయిన దశలో ఉన్న మృతదేహం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. తలకిందులుగా చేతులు, మొండెం వరకు మాత్రమే మృతదేహం ఉందన్నారు. నవేగాం పంచాయతీ కార్యదర్శి గొడిసెల చంద్రమోహన్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పత్తి రైతు పరేషాన్..!

- చేలలో నిలుస్తున్న వర్షపు నీరు
- ఎడతెరిపిలేని వానలతో తెగుళ్ల ముప్పు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో రైతులు


పంట మునిగిపోవడంతో కన్నీరు పెడుతున్న రైతు


వీర్దండిలో పత్తి పంటలో చేరిన వరదనీరు

కౌటాల: భారీ వర్షాలు, వరదలు అన్నదాతను నిండా ముంచుతున్నాయి. ప్రాణహిత, పెన్‌గంగ, వార్ధా నదుల పరీవాహక ప్రాంత రైతులకు ఏటా కన్నీరే మిగులుతోంది. వర్షాలకు సరిహద్దులోని ఆయా నదులు పొంగడంతో పంటలు నీటి పాలయ్యాయి. కౌటాల, దహెగాం, బెజ్జూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి మండలాల్లో 315 మంది రైతులకు సంబంధించిన 6,453 ఎకరాల్లో పత్తి, వరి, కంది, పెసర, మిర్చి, జొన్న పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. చేనుల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నష్టపోయిన రైతులను గుర్తించి ఎకరానికి రూ.10 వేలు చొప్పున పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

మొక్కల ఎదుగుదలపై ప్రభావం..

జిల్లా వ్యాప్తంగా 3.50 లక్షల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. పంట చేలల్లో వరద నీరు చేరడంతో పత్తి మొక్కల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడనుంది. చెలక, నల్లరేగడి భూముల్లో మొక్కలు ఎర్రబడ్డాయి. గడ్డి విపరీతంగా పెరిగిపోవడం, మొక్కలకు వేరు తెగులు, పూత, కాత రాలిపోవడం వంటి తెగుళ్ల ఉధృతమయ్యే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వర్షాల కారణంగా పత్తి చేలలో నీరు అధికంగా నిల్వ ఉండకుండా కాలువలు చేసి నీటిని బయటకు పంపాలి.
- భూమిలో నీటి తేమశాతం ఎక్కువగా ఉండడం కారణంగా మొక్కలు పోషకాలను గ్రహించవు. దీని కోసం కరిగే ఎరువులైన 19:19:19, 13:0:45, 10 గ్రాములను ఒక లీటర్ నీటిలో కలుపు కొని పిచికారీ చేయాలి.
- వర్షాల వలన వడతెగులు పత్తి పంటపై ఆశించడం వలన దీని నివారణ కోసం 3 గ్రాముల లెటాక్స్ లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదళ్ల వద్ద పోయాలి. అవసరాన్ని బట్టి రెండోసారి కూడా 15 రోజుల వ్యవధిలో పోయాలి. వారం పది రోజులకోసారి అవసరాన్ని బట్టి పోషకాలను పిచికారీ చేయాలి.
- అధిక వర్షాల వల్ల ఆకులు పసుపు లేదా ఎరుపు రంగులో కనిపిస్తాయి. నివారణకు లీటర్ నీటికి 10గ్రా. యూరియా, 10గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- భూమి, వాతావరణంలో తేమ అధికంగా ఉన్నప్పుడు పత్తిని ఆకుపచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు పది లీటర్ల నీటిలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, గ్రాము స్ట్రెప్టో సైక్లిన్‌ను కలిపి పిచికారీ చేయాలి.
- తేమతో మొక్కల ఎదుగుదల తగ్గితే 20 గ్రాముల యూరియా లేదా పది గ్రాముల 20 –20 లీటరు నీటిలో కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేస్తే మొక్కలు త్వరగా కోలుకుంటాయి. పూత దశలో గులాబీ రంగు పురుగు ఆశించినట్లు గమనించినట్లయితే ఎకరాకు 4 నుంచి 8 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. ఈ బుట్టల్లో వరసగా మూడు రోజుల నుంచి ఐదు రోజుల చొప్పున రెక్కల పురుగులు పడినట్లయితే 5మి. లీ. వేపనూనె లీటర్ నీటిలో కలిపి వాడాలి.

నీరు నిల్వకుండా చూడాలి



ప్రాణహిత, పెన్‌గంగా, వార్ధా నదులు ఉప్పొంగి ప్రవహించడంతో పంటల్లో వరద నీరు చేరింది. పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం. రైతులు ఆందోళన చెందొద్దు. పంటల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలు తీసి నీటిని బయటకు పంపించాలి. వేరుకుళ్లు తెగులు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును ఒక లీటర్ నీటికి కలిపి మొక్కల మొదల్లో తడిసేలా చుట్టూ పోయాలి. వీలైనంత త్వరగా అంతర కృషి చేయాలి. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

– ప్రేమలత, ఏవో, కౌటాల

ఓటరు జాబితాపై అభ్యంతరాలు సమర్పించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: స్థానిక సంస్థల ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 30 లోగా సమర్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక సంస్థల ఓటరు జాబితా అభ్యంతరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేశామన్నారు. ఈ నెల 31న అభ్యంతరాలు పరిష్కరించి, సెప్టెంబర్ 2న తుది జాబితా ప్రదర్శిస్తామని తెలిపారు. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు, 1874 పోలింగ్ బూత్‌ల్లో గ్రామీణ ఓటర్లు 3,53,904 మంది ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో డీపీవో భిక్షపతి, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, డీఎల్‌పీవో ఒమర్ హుస్సేన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భవనాల ఎంపిక వేగవంతం చేయాలి..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని సిర్పూర్(టి) గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు విద్య అభ్యసించేందుకు భవన ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, గురుకుల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాల, కళాశాల శిథిలావస్థలో ఉండటంతో అక్కడి విద్యార్థులను ఉమ్మడి జిల్లా గురుకులాల్లో సర్దుబాటు చేశామన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు ఉన్న భవనం ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ జోనల్ అధికారి అరుణకుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళిక తయారు చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: గిరిజనుల అభివృద్ధి కోసం, వారికి కావాల్సిన ప్రణాళిక తయారు చేయాలని ఎంపీడీవో ఎండీ అంజద్‌పాషా అన్నారు. శుక్రవారం మోడి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 'ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్' కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఏడు గ్రామాలు ఎంపికయ్యాయని, ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం తక్షణ సర్వే ప్రారంభించాలన్నారు. ఎఫ్ఆర్‌వో మజారోద్దిన్, ఎంఈవో ఆడే ప్రకాశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరరావు, ఎస్సీఆర్పీ నరేశ్, ఏపీఎం ముక్తేశ్వర్, సూపర్‌వైజర్‌లు ఉన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో జనజాతీయ ఉన్నతి గ్రామీణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గోంది, మాలిని, రేగులగూడ, మారెపల్లి గిరిజన గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన గ్రామాల్లో ప్రజలకు అందుతున్న సౌకర్యాలు, అందించాల్సిన విద్య, వైద్యంపై శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో కోట ప్రసాద్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో ప్రజలకు ఆధార్‌కార్డు, రేషన్ కార్డులు నూరుశాతం ఉండే విధంగా చూడాలన్నారు. మాస్టర్ ట్రైనర్ మహేశ్, ఎంఈవో ప్రభాకర్, ఏఈ రవికుమార్, ఏపీఎం వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివాసీ పీఎం జుగ రెండు రోజుల శిక్షణ తరగతులను జ్యోతిప్రజ్వలన చేసి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సోమిని, ఊట్ సారంగపల్లి, మొగవెల్లి గ్రామపంచాయతీలు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపీవో గౌరీశంకర్, ఎంఈవో డాక్టర్ సునీత, ఏపీవో రాజన్న, ఏపీఎం మోహన్‌దాస్, కరుణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


మాట్లాడుతున్న వైస్‌ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా వికాసానికి కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ డి.లక్ష్మీనరసింహం మాట్లాడుతూ గ్రాంథిక భాషను వ్యతిరేకించి వ్యవహారిక భాషా ఉద్యమానికి శ్రీకారం చుట్టి తెలుగు భాషను సరళీకరించిన గొప్ప మహనీయుడు గిడుగు రామమూర్తి అన్నారు. తెలుగు భాషా వికాసానికి కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు వివిధ సాంస్కృతిక పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ జనార్దన్, అధ్యాపకులు మహేశ్, సంతోష్, వెంకటేశ్వర్లు, దేవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


తిర్యాణి: మాట్లాడుతున్న సీఐ సంజయ్


సిర్పూర్(టి): గుడుంబా సామగ్రితో పోలీసులు

తిర్యాణి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రెబ్బెన సీఐ సంజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోయెగాం, బోరింగ్‌గూడ గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం (కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 35 మంది పోలీసు సిబ్బంది 150 ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సరైనా ధ్రువపత్రాలు లేని ఐదు వాహనాలకు జరిమానాలు విధించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాలోల్ ఎక్కడైనా గంజాయి సేవించడం, విక్రయించడం, గుడుంబా తయారు చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సై శ్రీకాంత్, ఏఆర్‌ఎస్సై శ్రీనివాస్, ఏఎస్సై నారాయణ తదితరులు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..

సిర్పూర్(టి): గ్రామాల్లో ప్రజలు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ఇళ్లతో పాటు పంట చేనుల్లోనూ పరిశీలించారు. గ్రామంలోని ద్విచక్ర, ఇతర వాహనాల ధ్రువపత్రాలు పరిశీలించారు. పంట చేనుల్లో 5 లీటర్ల గుడుంబా, పటికతో పాటు గుడుంబా తయారు చేసే సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్‌తో పాటు ముగ్గురు ఎస్సైలు, 40 మంది సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం


మాట్లాడుతున్న చైర్మన్ ఓంప్రకాశ్

బెజ్జూర్: బెజ్జూర్ పీఏసీఎస్ మాజీ సీఈవో జక్కుల వెంకటేశ్వర్ గౌడ్, కార్యదర్శి పర్షా సంజీవ్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చైర్మన్ ఓంప్రకాశ్ అన్నారు. శుక్రవారం బెజ్జూర్ పీఏసీఎస్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. పాలకవర్గ సమావేశంలో బెజ్జూర్ మాజీ సీఈవో వెంకటేశ్వర్ గౌడ్, కార్యదర్శి సంజీవ్‌లకు మరో 21 రోజులు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 12న జిల్లా డీసీఓ బిక్కు నాయక్ ఆదేశాల మేరకు వారి అక్రమాలపై విచారణ జరిపి నిధుల రికవరీకి ఆదేశాలు జారీ చేయాలని, క్రిమినల్ చర్యలు నమోదు చేయాలని సిఫార్స్ చేశారన్నారు. పీఏసీఎస్ కార్యదర్శి జక్కుల సత్యనారాయణ గౌడ్, డైరెక్టర్లు రాచకొండ శ్రీవర్ధన్, తేలి బాపు, గట్టు లలిత, మేకల కోటేష్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీల సమావేశం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వివిధ పార్టీల నాయకులకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల పరిశీలనల కోసం మండలంలోని రాజకీయ పార్టీల నాయకులకు మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశానికి హాజరై ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు


కెరమెరి: సేవాదాస్‌నగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: వినాయక నవరాత్రుల్లో భాగంగా 3వ రోజు జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో నెలకొల్పిన గణేశ్ మండపాల వద్ద బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావ్, పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం, మల్లిఖార్జున్‌లు శుక్రవారం వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక టీఆర్ నగర్‌లో గణేశ్ మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అరిగెల నాగేశ్వర్‌రావ్, శ్రీశైలంలు భక్తులకు భోజనం వడ్డించారు. అరిగెల మల్లిఖార్జున్ బ్రాహ్మణవాడ గణేశ్ మందిర్‌లో వినాయకుడిని దర్శించకుని, కంచుకోట గణేశ్ మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీగౌడ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయం, సేవాదాస్ నగర్, విద్యానగర్, నెహ్రూనగర్‌లలో కొలువుదీరిన గణనాథులకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా మహిళలు, పురుషులు ఉదయాన్నే మండపాలకు చేరుకొని పూజలు చేశారు.

కౌటాలలో..


కౌటాల: మండలంలోని భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఆయా మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడు మండలంలోని అన్ని గ్రామాల్లో పూజలందుకున్నాడు. గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కుంకుమార్చన పూజలు..

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని గొల్లవాడ గణేశ్ మండలి వద్ద శుక్రవారం కాలనీకి చెందిన మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. స్థానిక శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలోని గణేశ్ మండపం వద్ద మండప నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దహెగాం: మండలంలోని ఆయా గ్రామాల్లో కొలువుదీరిన గణనాథుల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండల కేంద్రంలోని కాలేజ్ రోడ్, మండలంలోని బీబ్రా గ్రామంలో సాయినాథ దేవాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుల వద్ద మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. మహిళలు కుంకుమ పూజలో మంగళహారతులతో పాల్గొని వినాయకుడికి పూజలు చేశారు. వినాయకుని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రేమికుడు.. గణనాథుడు


ప్రకృతి ఒడిలో వినాయక విగ్రహం

చింతలమానెపల్లి: మండల సరిహద్దు గ్రామం మహారాష్ట్రలోని ఆళ్లపల్లి పట్టణంలో టైగర్ గ్రూప్ వినాయక ఉత్సవ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ విగ్రహంలో గణేశుడు అడవి ఏనుగును ప్రేమగా కౌగిలించుకున్నట్లు కనిపిస్తున్నాడు. ఈ విగ్రహం భక్తులతో పాటు ప్రకృతి ప్రేమికులను ఎంతో ఆకట్టుకుంటుంది. ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించడానికి ఈ తరహా విగ్రహం ఏర్పాటు చేసినట్లు ఉత్సవ మండలి సభ్యులు తెలిపారు. మండలానికి సరిహద్దు గ్రామంలో ఉన్న వినాయక విగ్రహానికి మండలానికి చెందిన భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి వీక్షిస్తున్నారు.


సిర్పూర్ (టి): పూజలు చేస్తున్న మహిళలు


కౌటాల: శీర్ష గ్రామంలో..


దహెగాం: కుంకుమ పూజలో మహిళలు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పీడీ హరికృష్ణ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సింధు, మార్త రమేశ్, రాంచందర్, రయీస్ అహ్మద్, శ్యాంరావ్, చారి తదితరులు ఉన్నారు.